ప్రియాంకగాంధీ పర్యటన సైడ్‌లైట్స్

- ప్రియాంకగాంధీ ఖమ్మంకు వచ్చిన హెలీకాప్టర్ మధ్యాహ్నం 12–14గంటలకు గాలిలో కనపడగానే యువకులు కాంగ్రెస్ జిందాబాద్ అని నినాదాలు చేశారు.
- హెలీకాప్టర్ మధ్యాహ్నం 12–17నిముషాలకు సర్దార్ పటేల్ స్టేడియంలో ల్యాండ్ అయింది.
- అక్కడ సీఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క, పాలేరు, ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు స్వాగతం పలికారు.
- సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ, ఖమ్మం పార్లమెంట్ ఇంచార్జ్, మహారాష్ట్ర మాజీ హోంమంత్రి ఆరిఫ్ నసీమ్‌ఖాన్, కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్ కూడా స్వాగతం పలికారు.
- 12–24 గంటలకు భారీ కాన్వాయ్‌లో ప్రియాకం జెడ్పీ సెంటర్‌కు చేరుకుని ప్రచారం రథంపైకి ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు.
- అక్కడ నుండి పాత ఎల్‌ఐసీ ఆఫీస్, పాత బస్టాండ్ మీదుగా మయూరిసెంటర్ వరకు ప్రియాంకగాంధీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు.
- రోడ్డుషోతో వైరారోడ్డు జనసంద్రంగా మారగా, వ్యాపార సంస్థలు, ఆస్పత్రుల వద్ద ప్రియాంకాగాంధీని చూసేందుకు జనం ఉత్సాహం కనబర్చడంతో పాటు సెల్‌ఫోన్లలో ఫొటోలు తీశారు.
- అంబేద్కర్ సెంటర్ నుండి మయూరిసెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా జనం ప్రియాంకగాంధీతో ముందుకుసాగారు.
- మయూరిసెంటర్‌లో ప్రచారవాహనం దిగిన ప్రియాంక కాన్వాయ్‌లో కాల్వొడ్డు వద్దకు చేరుకుని మళ్లీ రథంపైకి ఎక్కి అభివాదం చేస్తూ ముందుసాగారు.
- నాయుడుపేట జంక్షన్ వద్ద కొమ్ము నృత్యాలు చేస్తున్న గిరిజనులను ప్రియాంక దగ్గరకు పిలిపించి మాట్లాడారు. అలాగే, ఆర్టీసీ కాలనీ వద్ద గిరిజన మహిళలను సైతం పిలిచి వారితో కలిసి నృత్యం చేశారు.

– ఖమ్మం వన్‌టౌన్

క్లుప్తంగా

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం

ఖమ్మం స్పోర్ట్స్: జాతీయ నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) దినోత్సవం శనివారం నగరంలోని పలు కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాలలో చెట్లు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో సుబేదార్‌మేజర్ లలిత్‌సింగ్ మాట్లాడగా.. కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కోటా అప్పిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వీ.రమణరావు, ఎన్‌సీసీ అధికారులు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా కవిత డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా.. ఎన్‌సీసీ అధికారులు, కేడెట్లు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు నిరంజన్, చవాన్, కళాశాల కరస్పాండెంట్ పారుపల్లి ఉషాకిరణ్, ప్రిన్సిపాల్ సీహెచ్.రాధాకృష్ణ, శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ కుట్రలు సాగవు..

కామేపల్లి: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కుట్రలు, ఆటలు సాగవని బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ధనియాకుల హనుమంతరావు అన్నారు. శనివారం పండితాపురంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతాంగానికి రైతుబంధు ఇవ్వొద్దని కాంగ్రెస్ నాయకులు ఎంత అడ్డుకున్నా.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు న్యాయం చేసిందన్నారు. రైతులు ఆలోచించి ఓటేయాలని, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే కరెంట్ కష్టాలతో పాటు రైతులకు అందిస్తున్న రైతుబంధు, ధరణి వంటి పథకాలను ఆపేస్తారని చెప్పారు. రైతులు బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని, బీఆర్‌ఎస్‌తోనే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు.

నేడు విశ్వబ్రాహ్మణ వనసమారాధన

ఖమ్మంఅర్బన్: నగరంలోని చెరుకూరి మామిడి తోటలో నేడు(ఆదివారం) ఖమ్మం నగర విశ్వబ్రాహ్మణ వనసమారాధన ఏర్పాటు చేసినట్లు నగర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ వనసమారాధన నిర్వహణ కమిటీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం జరగాల్సిన కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వల్ల ఆదివారానికి మార్చినట్లు తెలిపారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కుటుంబసభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

‘బొమ్మ’లో ఫ్రెషర్స్ డే

ఖమ్మంఅర్బన్: నగరంలోని బొమ్మ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ రాజేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్య, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో రాణించి కాలేజీకి, తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలన్నారు. అనంతరం కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించాక విద్యార్థులు చైర్మన్‌ను సన్మానించారు. విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేయగా.. వైస్ చైర్మన్ సత్యప్రసాద్, కార్యదర్శి ఉదార్ శ్రీధర్, డైరెక్టర్ మాధవి, అనూష, ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సునామీ వస్తోంది..



నాయుడుపేట వద్ద అభివాదం చేస్తున్న ప్రియాంకగాంధీ, పక్కన పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భట్టి, తుమ్మల

- బీఆర్‌ఎస్ పార్టీ కొట్టుకుపోవడం ఖాయం
- ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీ



పెదతండా నుంచి వరంగల్ క్రాస్‌రోడ్డు వరకు కిక్కిరిసిన కాంగ్రెస్ శ్రేణులు

ఖమ్మంరూరల్: కాంగ్రెస్ సునామీలో బీఆర్‌ఎస్ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీ అన్నారు. పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఖమ్మం రూరల్ మండలంలోని నాయుడుపేట, పెదతండా, వరంగల్ క్రాస్‌రోడ్‌లలో శనివారం జరిగిన రోడ్డు షోల్లో ఆమె మాట్లాడారు. ఈ రోడ్డు షోకు జనం భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా పెదతండాలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ప్రియాంకగాంధీ మాట్లాడుతూ గత పదేళ్లలో తెలంగాణాను కేసీఆర్‌ను భ్రష్టు పట్టించాడని, ప్రజలకు అన్నీ కష్టాలేనని, ఎన్నో కళలతో, ఆశలతో తెచ్చుకున్న తెలంగాణాలో కేవలం కేసీఆర్ ఒక్క కుటుంబానికే మేలు జరిగిందని తెలిపారు. తెలంగాణాలో నిరుద్యోగ యువతకు ఎలాంటి ఉద్యోగాలు ఇవ్వకుండా కేసీఆర్ మాత్రం తన కుటుంబంలో నాలుగు ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. ఎక్కడైతే కాంగ్రెస్ ప్రభుత్వం ఉందో అక్కడ సంపదంతా ప్రజలకే పంచామని తెలిపారు. మీరు ఎటువంటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలంటే భారీ మెజార్టీతో వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తామని తెలిపారు. రైతులు, మహిళలు, యువత ఎన్నో కష్టాలననుభవించి తెలంగాణా తెచ్చుకుంటే కేసీఆర్ తెలంగాణా సంపదను దోచుకున్నాడని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికీ ఇళ్లు, యువతకు ఉద్యోగాలు, మహిళలకు ఆర్థిక సాయం, రైతులకు రుణమాఫీ ఒకేసారి చేస్తామని తెలిపారు. ఈరోడ్ షోలో పాలేరు, ఖమ్మం, మధిర కాంగ్రెస్ అభ్యర్థులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెక్కల కష్టంతో ఖమ్మంను అభివృద్ధి చేశా..



రోడ్డు షో ద్వారా ప్రజలను ఓటు అభ్యర్థిస్తున్న పువ్వాడ



ఖమ్మంఅర్బన్: వయో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న పువ్వాడ



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న అజయ్‌కుమార్

ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్: సీఎం కేసీఆర్, కేటీఆర్‌ల సహకారంతో వేల కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చి ఖమ్మంను అభివృద్ధి చేశానని, ప్రతి పనిలో తన రెక్కల కష్టం ఉందని ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఖమ్మంలోని 14, 21వ డివిజన్ల రోడ్‌షో, ఎనిమిది పాస్టర్స్ ఫెలోషిప్స్ అధ్యక్షుల ఆధ్వర్యాన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పువ్వాడ పాల్గొని మాట్లాడారు. స్థానికుడిని కాబట్టే అభివృద్ధి పనులన్ని పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులో ఉంచామని అన్నారు. తనపై పోటీ చేస్తున్న ప్రత్యర్థి మంత్రిగా ఉన్నప్పుడు సత్తుపల్లి, పాలేరులో పనులు చేయించుకున్నాడే తప్ప ఖమ్మం గురించి పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ఇస్తున్న ఆరు గ్యారంటీలకు, ఆ పార్టీకి గ్యారంటీ లేదని అన్నారు. ఆ పార్టీ హయాంలో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని, నాయకులు అక్రమంగా సంపాదించుకున్నారని అన్నారు. ఖమ్మంలోని అన్ని మతాలను గౌరవించుకుంటూ, మత సామరస్యం కాపాడడంలో ముందున్నానని చెప్పారు. ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే కారు గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా.. రఘునాథపాలెం జెడ్పీటీసీ మాలోత్ ప్రియాంక నిశ్చితార్థం వేడుకల్లో పువ్వాడ పాల్గొని కాబోయే నూతన జంటను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు ఆళ్ల నిరీషా అంజిరెడ్డి, ప్రశాంతిలక్ష్మి, కర్నాటి కృష్ణ, బీఆర్‌ఎస్ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి పల్లా కిరణ్, చింతగుర్తి సర్పంచ్ మెంటం రామారావు, కే.వీ. సీతారామయ్య, రామారావు, అజ్మీరా వీరునాయక్, వేదరత్నం, విశ్వం, జెడ్ సుధాకర్, పాస్టర్లు పాల్గొన్నారు.

అవ్వా పింఛన్ వస్తుందా..?

14వ డివిజన్‌లో ఓ వయో వృద్ధురాలితో అవ్వా పింఛన్ వస్తుంది కదా.. మళ్లీ బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే పింఛన్ పెరుగుతుందని చెప్పి ఈవీఎంలో కారు గుర్తును చూపిస్తూ ప్రచారం సాగించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

రఘునాథపాలెం మండలం వేపకుంట్లకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు చల్లగుండ్ల శ్రీనివాసరావు, నరేశ్, ద్రౌపతి, శ్రీవిద్యలు బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అలాగే 38వ డివిజన్ కాంగ్రెస్ మైనారిటీ సీనియర్ నాయకుడు సయ్యద్ అక్రం అలీ, బీఆర్‌ఎస్ నాయకుడు ఇస్సాక్ ఆధ్వర్యాన బీఆర్‌ఎస్‌లో చేరారు.

కార్తీక పౌర్ణమి.. శుభప్రదం..

దీపారాధన, పూజలకు సర్వం సిద్ధం



పూజా స్టాల్ ఎదుట సామగ్రి

ఖమ్మంగాంధీచౌక్: కార్తీక పౌర్ణమి శివకేశవులకు ప్రియమైన రోజుగా భావించి, దీపం వెలిగిస్తే తెలిసీ తెలియక చేసిన పాపాలన్నీ హరించుకుపోతాయనే నమ్మకం. కార్తీక పౌర్ణమి రోజు రుద్రాభిషేకం, సత్య నారాయణ వ్రతాలు చేస్తారు. తెల్లవారుజామున నదీ స్నానం శుభప్రదమని పురాణాలు చెబుతున్నాయి. రోజంతా ఉపవాసం ఉండి, సాయంత్రం 365 వత్తులతో దీపాన్ని వెలిగిస్తారు. రోజుకు ఒక వత్తి చొప్పున ఏడాది మొత్తానికి ఇది వర్తిస్తుందని నమ్మకం. కొందరు దీపాన్ని అరటి దొప్పలో ఉంచి నదిలో లేదా కొలనులో వదులుతారు. మరి కొందరు శివాలయాల్లో, కొందరు ఇళ్లలో దేవుడి పటం వద్ద, తులసికోట ఎదుట వెలిగిస్తారు. శివాలయాల్లో జ్వాలా తోరణం వైభవంగా జరుపుతారు. ఈ ఏడాది కార్తీక పౌర్ణమి ఆదివారం మధ్యాహ్నం 3:53 గంటలకు ప్రారంభమై సోమవారం మధ్యాహ్నం 2:45 వరకు ఉంటుంది. అయితే చాంద్రమానం ప్రకారం ప్రాతఃకాలాన్ని పరిగణనలోకి తీసుకొని సోమవారం కార్తీకపౌర్ణమిగా కార్యక్రమాలను జరుపుకోవాలని పండితులు చెబుతున్నారు. కాగా, ప్రత్యేక పూజల కోసం నగరంలోని కమాన్‌బజార్, కస్బాబజార్, గాంధీచౌక్, ఆలయాల వద్ద, రైతుబజార్ల వద్ద, పలు కూడళ్లలో పూజా సామగ్రి విక్రయించేందుకు భక్తులు బారులుదీరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నేలకొండపల్లి/ఖమ్మంఅర్బన్: నేలకొండపల్లి మండలంలోని కొత్తకొత్తూరు వద్ద విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడుతుందని ఏఈ కె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఖమ్మంఅర్బన్ విద్యుత్ సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు డైరీ ఫీడర్ రోటరీనగర్, 11నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వీవీపాలెం ఫీడర్‌లో, 11 నుంచి 2 గంటల వరకు వైఎస్‌ఆర్ కాలనీ ఫీడర్ పరిధిలో అంతరాయం ఉంటుందని ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఆయా ఫీడర్ల పరిధిలోని మమత ఓల్డ్ మెడికల్ కాలేజీ, రాధాక్రిష్ణనగర్, మమత ఆస్పత్రి ఏరియా, నేతాజీనగర్, రోటరీనగర్, వీవీపాలెం, నూతన కలెక్టరేట్, వైఎస్‌ఆర్‌కాలనీ, వెలుగుమట్ల, పారిశ్రామిక ప్రాంతం తదితర కాలనీలు, ఏరియాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ఈవీఎంలో ఓటు వేసే విధానాన్ని వివరిస్తున్న జెడ్పీటీసీ

కామేపల్లి: బీఆర్‌ఎస్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ బానోత్ వెంకటప్రవీణ్‌కుమార్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని బాసిత్‌నగర్, గోపాలపురం గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి హరిప్రియ విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటికి తిరుగుతూ విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరించడంతో పాటు చేపట్టబోయే సంక్షేమ పథకాలను వివరించి కారు గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంపై తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నమ్మకం ఉందని, బీఆర్‌ఎస్ ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. గిరిజనులంతా ఐక్యంగా పనిచేసి హరిప్రియనాయక్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బానోత్ రాందాస్, సున్నావత్ సూర్య, బాలు, రమేశ్, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలకు జేఐహెచ్ మద్దతు..



తుమ్మలకు వినతి పత్రం అందిస్తున్న జేఐహెచ్ బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావుకు జమాతే ఇస్లామి హింద్ (జేఐహెచ్) మద్దతు పలికింది. శనివారం ఈమేరకు ఖమ్మం అజీజ్‌గల్లీ సంఘ కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసి తమ డిమాండ్లను వినతి ద్వారా తుమ్మలకు అందజేసింది. ఖమ్మంలోని పాత షాదీఖానాను పూర్తి హంగులతో పూర్తి చేయాలని, కొత్త షాదీఖానా పనులను వెంటనే చేపట్టాలని, ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి రఘునాథపాలెం వరకు ముస్లింలకు శ్మశానవాటిక లేక ఇబ్బంది పడుతున్నందున శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని, ఈద్గాలకు ప్రహరీ గోడలు వక్ఫ్ ఆస్తులను కాపాడాలని తదితర సమస్యలను తుమ్మల దృష్టికి తీసుకెళ్లగా.. తుమ్మల ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జైనుల్ పాషా, అబ్దుల్ మల్లిక్, అబ్రార్ అలీ, రఫీ, సమీ, ఖలీల్, అహ్మద్ ఖాన్, అబ్దుల్ సుబూర్, ముజీబ్, అన్జుమ్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే బీఆర్‌ఎస్ వాగ్దానాలు..

ఖమ్మం మామిళ్లగూడెం: నియంతపాలన సాగించిన కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు ఓటమి భయంతోనే పలు వాగ్దానాలు చేస్తున్నారని ఈబీసీ జాతీయ అధ్యక్షుడు వల్లపు రవీందర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్లపాలలో అన్ని వర్గాల ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, ప్రజా వ్యతిరేకతను మూట కట్టుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం స్టీరింగ్ ఓవైసీ చేతుల్లో ఉంటే, గేర్, బ్రేకులు మాత్రం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేతుల్లో ఉందని చెప్పారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రజలు కేసీఆర్ మోసాన్ని పసిగట్టాలని, కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి బరిలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు, రైతు సేవా సమితి నాయకులు రాంరెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయండి



రమణాతండా ప్రచారంలో సీపీఎం నాయకులు

తిరుమలాయపాలెం: సీపీఎం పాలేరు ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని వీరభద్రం విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం కూసుమంచిలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శనివారం సభ విజయవంతం చేయాలని విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సభకు త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్ హాజరవుతున్నందున పెద్ద ఎత్తున కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుళ్లూరు నాగేశ్వరావు, నాగాటి సురేశ్, దాసరి మహేందర్, వీరన్న, కొత్తపల్లి వెంకన్న, అంగిరేకుల నరసయ్య, కొమ్ము నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ గారడీ మాటలు నమ్మి మోసపోవద్దు..



కూసుమంచి: గురువాయిగూడెంలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నేలకొండపల్లి: మోటాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రసాదరెడ్డి

పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇబ్బందులు పడతారు... కరెంటు ఉండదు.. రైతుబంధు రాదు అంటూ సీఎం కేసీఆర్ చెపుతున్న గారడీ మాటలను నమ్మి మరోసారి మోసపోవద్దని, ఇందిరమ్మ రాజ్యం వస్తేనే భవిష్యత్ ఉంటుందని కాంగ్రెస్ ప్రచార కమిటీ కో–చైర్మన్, పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం రాత్రి మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ప్రజలు కాంగ్రెస్ వెంట నడుస్తుంటే తట్టుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వంపై పలు విమర్శలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ఎన్నికల ముందు తనకు ఆరోగ్యం బాగా లేనట్లు నటిస్తారని, అటువంటి డ్రామాలను ప్రజలను నమ్మొద్దన్నారు. హస్తం గుర్తుపై ఓటు వేసి పాలేరులో తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే.. ఏడాదిలోగా అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. కాగా, ఆయా గ్రామాల్లో పొంగులేటికి ఘన స్వాగతం లభించగా.. గురువాయిగూడెంలో పలువురు పొంగులేటి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, మద్ది శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీలు జూకూరి గోపాలరావు, రామసహాయం వెంకటరెడ్డి, ముత్తయ్య, అధికార ప్రతినిధి వెంకటరత్నం, ఎండీ హఫీజుద్దీన్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలి

నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: నిరంకుశ బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని మోటాపురంలో గడపగడపకూ కాంగ్రెస్ నిర్వహించగా.. టీడీపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఎంపీపీ వజ్జా రమ్య, నాయకులు శాఖమూరి రమేష్, గుడిమళ్ల మధు, బొల్లినేని వెంకటేశ్వర్లు, బెల్లం పెద్దబ్బాయి, కృష్ణమూర్తి, ఏలూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అంతేకాక నేలకొండపల్లిలో కాంగ్రెస్ నాయకుడు నిమ్మగడ్డ నగేశ్, ఖమ్మంరూరల్ మండలం దానవాయిగూడెంలో ఉసికల అభిలాశ్ శనివారం మృతిచెందగా.. వారి మృతదేహాలపై ప్రసాదరెడ్డి పూలమాల వేసి నివాళుర్పించారు. నాయకులు నాగేశ్వరరావు, వెంకన్న, శంకర్, వీరయ్య, బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

‘కోరం’ విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం



కొత్తలింగాలలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

కామేపల్లి: కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య విజయాన్ని కాంక్షిస్తూ శనివారం మండల వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. అలాగే పండితాపురంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ ప్రచారం నిర్వహించగా.. కొత్తలింగాలలో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటికి తిరిగి బొట్టు పెట్టి హస్తం గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అంతేకాక కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెరుకుమళ్ల బ్రహ్మయ్య, నర్సింహారావు, ఇట్టా శ్రీను, తోటకూరి శ్రీను, తుమ్మలపల్లి వీరయ్య, పండగ కోటి, పగిడిపల్లి కోటయ్య, నాగేశ్వరరావు, ఎరుకల రమేశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన..



ఖమ్మంఅర్బన్: జెడ్పీ హైస్కూల్‌లో మాక్ పోలింగ్

ఖమ్మంసహకారనగర్/ఖమ్మంఅర్బన్/ఖమ్మం రూరల్: ఓటు హక్కు వినియోగంపై నగరంలోని స్మార్ట్ కిడ్జ్, సర్వజ్ఞ,లిటిల్ ఇండియన్స్ పాఠశాలలు, 1వ డివిజన్ ఖైకొండాయిగూడెం జెడ్పీ హైస్కూల్, ఖమ్మం రూరల్ మండలం మారెమ్మతల్లి ఆలయ సమీపాన జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికపండల అశోక్ అవగాహన ర్యాలీ, కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల యాజమాన్యాలు, పలువురు ఓటు ప్రాధాన్యతను వివరించారు.

ప్రజలకు ఇచ్చిన మాట ఏనాడు తప్పలేదు..



పాలేరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి



లోక్యాతండాలో భారీగా హాజరైన కార్యకర్తలు

పాలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి: తాను నియోజకవర్గ ప్రజలకు హామీలు ఇవ్వకుండానే అనేక పనులు చేశానని, ఇచ్చిన హామీలను, వాగ్దానాలను ఏనాడు విస్మరించలేదని, మాట తప్పటం తన జీవితంలో జరగలేదని, పాలేరు ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి ఓటు వేసి మోసపోవద్దన్నారు. గత పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో ఎనలేని అభివృద్ధిసాధించి చూపిందని, అటువంటి ప్రభుత్వాన్ని మరోమారు ఎన్నుకుంటే ప్రజలు ఆనందంగా ఉంటారని అన్నారు. తాను ఎమ్మెల్యేగా పార్టీలకతీతంగా అందరికీ సాయం చేశానని, తాను లోకల్ బిడ్డగా ప్రజల్లో ఉండి ఐదేళ్లు సేవ చేశాను కాబట్టి తనకే ఓటు వేయాలన్నారు. తాను చేసిన అభివృద్ధి పాలేరు ప్రజలకు తెలుసునని, తాను రాకముందు ఏ ఎమ్మెల్యే తన జేబులో వంద రూపాయలు తీసిన దాఖలాలు లేవన్నారు. తాను గెలిస్తే ప్రజలు నేరుగా తనను కలువవచ్చని, కాంగ్రెస్ గెలిస్తే అపాయింట్‌మెంట్ కావాలని ఎద్దేవా చేశారు. కందాళకు భయం అనేది తెలవదని, తాను చెప్పిందే చేస్తాడు తప్ప డ్రామాలు ఆడనని అన్నారు. పాలేరులో వార్ వన్‌సైడేనని, గెలుపు తనదేనని ధీమా వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో కందాళకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, నియోజకవర్గ సమన్వయ కర్త తాళ్లూరి జీవన్‌కుమార్, జెడ్పీటీసీ ఇంటూరి బేబీ, ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్‌తో పాటు రామసహాయం బాలకృష్ణారెడ్డి, రాంకుమార్, వేముల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.